

లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు పద్మ, అమృత, తహసీల్దార్ వీరాబాయి, తదితరులు

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట/గోల్నాక, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మండలం పరిధిలో ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట మండలం పరిధిలో 156 మంది లబ్ధిదారులకు శనివారం ఆయన కార్పొరేటర్లు పద్మ, అమృత, తహసీల్దార్ వీరాబాయిలతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. 99 మందికి కల్యాణలక్ష్మి, 57 మందికి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఆయన అందజేశారు.



నిరసన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటకౌశిక్

మెస్ చార్జీలు పెంచాలని నిరసన

బర్కత్‌పుర, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మెస్ చార్జీలను పెంచుతామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా నేటికీ ఆచరణకు నోచుకోలేదని నిజాం కళాశాల బీసీ సెల్ అధ్యక్షుడు తాళ్లూరి వెంకటకౌశిక్ ఆరోపించారు. శనివారం నిజాం కళాశాలలో మెస్ చార్జీల నిరసన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులపై మెస్ చార్జీల భారం నెలకు రూ.1500 పడుతుందని, వీటిని కట్టలేని స్థితిలో పేద విద్యార్థులు ఉన్నారని అన్నారు. మెస్ చార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.8 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, మురళీధర్‌గౌడ్, సాగర్‌నాయక్, అనిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాలా స్లాబ్ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం

● అంబర్‌పేట డీఎంసీ మారుతి దివాకర్

అంబర్‌పేట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ నాలా స్లాబ్ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని అంబర్‌పేట డీఎంసీ మారుతి దివాకర్ అన్నారు. శనివారం ఆయన ప్రేమ్‌నగర్ నాలా స్లాబ్ నిర్మాణంపై బీజేపీ నేతల ఫిర్యాదు మేరకు నాలా స్లాబ్ నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. రోడ్డుకు ఎత్తుగా ఉన్న స్లాబ్ వల్ల స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ మైలారం రాజు డీఎంసీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన డీఎంసీ స్లాబ్‌ను రోడ్డుకు సమాంతరంగా చేసే పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



డీఎంసీ మారుతి దివాకర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నేత రాజు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మైనర్‌పై యువకుడి లైంగికదాడి

● నిందితుడి అరెస్ట్, రిమాండ్

హిమాయత్‌నగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం నారాయణగూడ పీఎస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, ఎస్సై షఫీతో కలిసి సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఫైఫొబాద్‌కు చెందిన మైనర్ (16) నారాయణగూడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖలీల్(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా ప్రేమికుడిగా నటిస్తూ బాలికను వేధిస్తున్నాడు. ఇటీవల బాలిక కళాశాలకు సరిగా రాకపోతుండడంతో యాజమాన్యం ఆమె తండ్రికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చింది. దీంతో బాలిక ఆచూకీ ఎంతకీ తెలియక పోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో బాలికను గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసిన సయ్యద్‌ఖలీల్ పారిపోయాడు. బాలికను భరోసాసెంటర్‌కు తరలించి వాంగ్మూలం నమోదు చేశారు. ఆమెను ఓయోకు తీసుకెళ్లిన సయ్యద్‌ఖలీల్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాల పనులను పూర్తి చేయాలి

● బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



బర్కత్‌పుర, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... 35 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఆర్ట్స్ కాలేజీ - సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ల నడుమ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలయి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఫొటోను చూసి గుర్తుపట్టిన వారు 8712658584 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు శనివారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్ఐ నాగరాజు రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గాంధీనగర్ పీఎస్ పరిధిలోని గాంధీ ఆస్పత్రి ఎదురుగా మెట్రో పిల్లర్ నంబర్ 1027 ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని శనివారం ఉదయం పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు దాదాపు 50 సంవత్సరాలు ఉంటాడని, అతను స్థానికంగా భిక్షాటయన చేసి జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

చిత్రాలనగర్‌లో అధ్వానంగా వీధులు

● రెండేళ్లు గడిచినా ప్రారంభం కాని షాబాద్ ఫ్లోరింగ్ పనులు ● పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు

కవాడిగూడ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్‌లో షాబాద్ ఫ్లోరింగ్ పనులకు శంకుస్థాపన జరిగి రెండేళ్లు గడిచినా నేటికి ఆచరణకు నోచుకోలేదు. జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. షాబాద్ ఫ్లోరింగ్ పనులు ప్రారంభించకపోవడంతో ఈ బస్తీ వాసులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. గుంతలు పడిన రోడ్లు, అడ్డదిడ్డంగా ఉన్న షాబాద్ బండలతో నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో వర్షం పడితే బస్తీలో ఉన్న వృద్ధులు, చిన్నారులు ప్రనమాదాల బారిన పడతారని స్థానికులు ఆందోళన పడుతున్నారు. చిత్రాలనగర్‌లో 2022 జూన్‌లో షాబాద్ ఫ్లోరింగ్ పనుల కోసం ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. స్థానికులు షాబాద్ ఫ్లోరింగ్ వద్దని తమ బస్తీలో ఉన్న మంచినీటి., డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునీకరణ చేసిన తరువాత బస్తీలోని వీధుల్లో సీసీరోడ్డు నిర్మించాలని కోరడంతో పనులు పెండింగ్‌లో పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అప్పటినుంచి ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తమ బస్తీ సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాదాపు 70 కుటుంబాలకుపైగా ఈ బస్తీలో జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బస్తీలో పెండింగ్‌లో ఉన్న మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు ఆధునీకరించి షాబాద్ ఫ్లోరింగా లేక సిసిరోడ్ల నిర్మాణం చేసి సమస్యను పరిష్కరించాలని చిత్రాల నగర్ బస్తీవాసులు కోరుతున్నారు.



బస్తీలో అధ్వానంగా మారిన వీధులు,

సమస్యను పరిష్కరించేందుకు చర్యలు



చిత్రాలనగర్‌లో పెండింగ్‌లో ఉన్న షాబాద్ ఫ్లోరింగ్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా, జీహెచ్ఎంసీ సిబ్బంది షాబాద్ ఫ్లోరింగ్ పనులు చేయడానికి వెళితే స్థానికులు మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునీకరణ తరువాతే పనులు చేపట్టాలని కోరడంతో పనులు ఆగిపోయాయి. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- ఎమ్మెల్యే ముఠాగోపాల్

అధికారుల దృష్టికి తీసుకెళతా

కవాడిగూడ డివిజన్‌లోని చిత్రాలనగర్‌లో పెండింగ్‌లో ఉన్న షాబాద్ ఫ్లోరింగ్ నిర్మాణ పనులు పూర్తయ్యేలా అధికారుల దృష్టికి తీసుకెళతా.బస్తీ వాసుల కోరిక మేరకు ఆ బస్తీలో మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్ ఆధునీకరించిన తరువాతే బస్తీలో షాబాద్ ఫ్లోరింగ్‌కు బదులుగా సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తాను

-కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

సీసీ రోడ్లు ఏర్పాటుచేయాలని కోరడంతో పనులు నిలిచిపోయాయి

కవాడిగూడ డివిజన్ చిత్రాలనగర్‌లో రెండు సంవత్సరాల కిత్రం షాబాద్ ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు నిధులు విడుదలయ్యాయి. బస్తీ వాసులు మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్‌లు ఆధునీకరించిన తరువాతే షాబాద్ ఫ్లోరింగ్ నిర్మాణ పనులకు బదులుగా సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలన్నందుకే పనులు నిగిచిపోయాయి. కొత్తగా ప్రతిపాదనలు పంపి బస్తీలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా

\- పన్నీ, మునిసిపల్ డీఈ

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు..!

కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా బీజేపీదే విజయమని. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.శనివారం రాత్రి బీజేపీ నగర కార్యాలయంలో ముషీరాబాద్ నియోజకవర్గం పోలింగ్ బూత్ కో కన్వీనర్లు. బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంత దుష్ప్రచారం చేసినా, ప్రజలు బీజేపీకే అండగా నిలిచారని చెప్పారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడంలో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీ విజయంలో కార్యకర్తలు ఎనలేని పాత్ర పోషించారని కొనియాడారు అసెంబ్లీ ఎన్నికలు ఎపుడు వచ్చినా బీజేపీ తిరుగులేని విజయం సాధిస్తుందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్. రమేష్ రామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, కార్పొరేటర్లు సుప్రియ గౌడ్, రచన శ్రీ, బీజేపీ నేతలు రాజశేఖర్ రెడ్డి, ఎడెల్లి అజయ్ కుమార్, సదానంద్, భరత్ గౌడ్. వెంకటేష్ నంద, అశోక్, పరిమల్ కుమార్, శివాజీ రాజు పాల్గొన్నారు.



బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

27 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

● నాలుగో తరగతికి అర్హత పరీక్షలు
● జింఖానా మైదానంలో నిర్వహణ
● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 27 నుంచి 30 వరకు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలుంటాయని చెప్పారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6-10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్స్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, కిలో మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు, బరువు, ఎత్తు, మెడికల్ టెస్టులుంటాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ఈ నెల 24, 25 తేదీల్లో జరుగుతాయని, జిల్లా స్థాయి ఎంపికలు 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి ఎంపికలు జులై 8 నుంచి 12 వరకు హకీంపేటలో ఉంటాయని చెప్పారు.

ప్రవేశ పోటీలకు హాజరయ్యే బాలబాలికలు 1.9.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారై ఉండాలని, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన 040-27900649 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ

మనీలాండరింగ్ కేసంటూ.. మహిళను భయపెట్టి, ఖాతా నుంచి రూ.15.76 లక్షలు..
గూగుల్ మ్యాప్ రేటింగ్ పేరుతో నగరవాసి నుంచి రూ.16.68 లక్షలు

హైదరాబాద్‌సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ చేశారు. ఇరాన్‌కు పంపిన పార్సిల్‌పై ఉన్న వివరాలు మనీ లాండరింగ్ కేసుల్లో నమోదై ఉన్నాయని నగరానికి చెందిన మహిళను భయపెట్టి, ఆమె ఖాతా నుంచి రూ.15.76 లక్షలను, గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నగరవాసిని నమ్మించి, అతని ఖాతా నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ప్రముఖ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పిన వ్యక్తి 'మీ పేరుతో ఇరాన్‌కు పంపిన కొరియర్ తిరిగి వచ్చింది. నీకు పార్సిల్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ విషయంపై సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి' సూచించి, మరో వ్యక్తికి కనెక్ట్ చేశాడు. స్కైప్ కాల్ చేసిన నిందితుడు 'మీ ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు అక్రమంగా డబ్బు తరలి వెళ్లింది. మీ ఆధార్‌పై ముంబై అంధేరి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి' అని పత్రాలు చూపాడు. ఈ కేసులకు తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పగా, 'మీ బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలి' అని సూచించాడు. 'మీ ఖాతాలో డబ్బులు ఆర్‌బీఐ అకౌంట్‌కు బదిలీ చేయాలి. 30 నిమిషాల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి, మీ డబ్బు తిరిగి మీ ఖాతాలో జమ చేస్తా రు' అని చెప్పాడు.

ఇలా చేయని పక్షంలో మనీ లాం డరింగ్ కేసులో అరెస్ట్ అవుతారని బెదిరించాడు. నమ్మిన మహిళ తన ఖాతాలో ఉన్న రూ.15.76 లక్షలను అతడు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. తర్వాత మోసపోయానని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గూగుల్ మ్యాప్ రేటింగ్ పేరుతో... రూ.16.68 లక్షలకు టోకరా

గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యక్తికి వాట్సప్‌కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు గూగుల్ మ్యాప్‌కు రేటింగ్స్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించారు. ముందుగా కొద్ది మొత్తం ఖాతాలో జమ చేశారు. మరింత డబ్బు కావాలంటే కొంత మొత్తం రీఫండబుల్ డిపాజిట్ చేయాలని సూచించారు. వారి మాట లు నమ్మిన వ్యక్తి రూ.16.68 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. తర్వాత నుంచి ఫోన్‌లు స్విచ్చాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

హెచ్‌సీఏ ఓపెన్ సెలెక్షన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉమెన్స్ లీగ్ కోసం వర్ధమాన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఓపెన్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్ వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉప్పల్ స్టేడియంలో సెలెక్షన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెటర్లు సోమవారం నుంచి www.hycricket.in వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదుచేసుకోవాలని చెప్పారు. గతంలో బీసీసీఐ టోర్నమెంట్స్, హైదరాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకున్న వారు, తెలంగాణ పౌరులు కాని వారు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనడానికి అనర్హులు అని దేవ్‌రాజ్ తెలిపారు.

శ్మశాన వాటికలో పనుల పరిశీలన

రాంనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మోహినిచెరువు శ్మశాన వాటికలో రూ. 2.70 కోట్లతో నిర్మించే నూతన భవనం, మరుగుదొడ్లు, చెట్లను నిర్మించే పనులను కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, శ్మశాన వాటిక కమిటీ సభ్యులు సందర్శించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామని కార్పొరేటర్ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీహరి, బలరామ్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



శ్మశాన వాటికలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం

చాంద్రాయణగుట్ట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో వివాహేతర సంబంధం యువకుడి హత్యకు దారితీసింది. బాబాకాంట సొహైల్ కాలనీకి చెందిన జాకిర్ అలీ(29)కి ఐదు సంవత్సరాలుగా అచ్చిరెడ్డినగర్‌కు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆ మహిళ తనను మరిచిపోవాలని అనేకసార్లు చెప్పినా జాకిర్ అలీ వేధించాడు. ఈ విషయం మహిళ తన సోదరుడికి చెప్పింది. అతను కూడా జాకీర్‌అలీని పలుమార్లు హెచ్చరించినా మారలేదు. శుక్రవారం రాత్రి మహిళ ఇంటికి జాకిర్‌అలీ వచ్చాడు. విషయం తెలుసుకుని సోదరుడు కూడా రావడంతో ఇద్దరి మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన ఆమె సోదరుడు జాకిర్‌అలీ తలపై ఐరన్‌రాడ్‌తో కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఫలక్‌నుమా పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ సంధ్యారాణి



రాంనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌నగర్ మండలం పరిధిలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హిమాయత్‌నగర్ తహసీల్దార్ డి. సంధ్యారాణి హెచ్చరించారు. ఆదాయ, నివాసం, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు మీ సేవలో అన్ని పత్రాలను అప్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి బోరింగ్ వేస్తే సీజ్ చేసి జరిమానాలు విధిస్తామని ఆమె హెచ్చరించారు. శనివారం మండలం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హిమాయత్‌నగర్ మండలం పరిధిలో 37 ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వాలు అమలు చేయాలి

● ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

రాంనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు జరిగేలా ప్రభుత్వాలు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కె. సూర్యం మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఒకే రకంగా పనిచేస్తున్న కార్మికులకు వేర్వేరు వేతనాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జీవో నంబర్ 51ను సవరించి ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. అరుణ్, నాయకులు సాంబశివుడు, గణేష్, నర్సింహ, కురుమయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలి

● తెలంగాణ ఆరోగ్యశ్రీ సిబ్బంది సంఘం

రాంనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్యశ్రీ పథకం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, ఆయూష్మాన్ భారత్, జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పథకం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బందికి, ఆరోగ్యమిత్రలకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశ్రీ సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గిరియాదయ్య, ఎం. కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర సమావేశంలో వారు మాట్లాడారు. కనీస వేతనాలు 35 వేలతోపాటు టీఏ, డీఏలు కల్పించాలని, ఆరోగ్య మిత్రలకు డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్స్ క్యాడర్ కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశ్రీ సిబ్బంది సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీవో 59 ప్రకారం స్థలాల రిజిస్ట్రేషన్ చేయాలి

చిక్కడపల్లి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జీవో 59 ప్రకారం అదనపు స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ క్వార్టర్స్ ఇండస్ట్రియల్‌కాలనీ వాసులు శనివారం రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా క్వార్టర్స్ వాసులు నర్మెట్ట మల్లేష్, మారిశెట్టి నర్సింగ్‌రావు, నాగెల్లి కృష్ణ మాట్లాడుతూ 58, 59 జీవోను అనుసరించి గాంధీనగర్ డివిజన్‌కు చెందిన ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీ ఇండస్ట్రియల్ కాలనీవాసులు మార్కెట్ విలువలో 25 శాతం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఇంకా కొద్దిమంది అంటే 150 మంది నివాసులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదన్నారు. అందుకుగాను 2021లోనే అప్లికేషన్ పొందుపరిచి తహసీల్దార్లకు పంపించడం జరిగిందన్నారు. ఈ విషయంలో తమకు సహాయం చేసి తమకు న్యాయం చేయాలని ఎంపీ అనిల్‌కుమార్‌ను కోరామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి తనవంతు సహాయం చేస్తానని ఇళ్ల రిజిస్ట్రేషన్ అయ్యేవిధంగా తనవంతు సహకారం అందిస్తానన్నారని తెలిపారు. ఎంపీని కలిసినవారిలో నివాసులు గుండు జగదీష్‌బాబు, గుండు మహేందర్, ఎండి ఖాజా, ఎండి నజీర్, దేవయ్య, కుమారస్వామి, అభిషేక్ తదితరులున్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్‌లో డిప్లొమా కోర్సుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రాజేంద్రనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల ఉద్యాన డిప్లొమా కోసం నోటిఫికేషన్ జారీచేసింది. ఉద్యాన పాలిటెక్నికల్‌లో 200 సీట్లు ఉండగా, ఆదిలాబాద్, రమగిరికిల్లా, కొల్లాపూర్ పాలిటెక్నిక్ ఉద్యాన కళాశాలలలో 40 చొప్పున ఇన్‌టెక్ కెపాసిటీ ఉందని వర్సిటీ అధికార వర్గాలు తెలిపాయి. మరో రెండు అఫీలేటెడ్ పాలిటెక్నిక్‌లు గడ్డిపల్లిలో గల గంటా గోపాల్‌రెడ్డి ఉద్యాన పాలిటెక్నిక్, మహబూబాబాద్‌లోని తొర్రూర్‌లోని విశ్వధార హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో కూడా 40 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నారని, జూలై 15వ తేదీ వరకు అందజేయవచ్చన్నారు. పాలిసెట్ 2024 లేదా 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, ఇంటర్ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి కనీసం 15 సంవత్సరాలు, గరిష్ఠంగా 22 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. 60శాతం సీట్లు గ్రామీణప్రాంతాల్లో కనీసం నాలుగు సంవత్సరాలు చదివిన విద్యార్థులకు కేటాయిస్తారని తెలిపారు.

మోజర్ల ఉద్యాన కళాశాలలో డిప్లొమా

వనపర్తి జిల్లా మోజర్లలోని ఉద్యాన కళాశాలలో, కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్‌లో ఉద్యాన డిప్లొమా చేయొచ్చని అధికారులు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట్ జిల్లాల విద్యార్థులకు ఇక్కడి ప్రాంగణం దగ్గరగా ఉంటుందని పాలిటెక్నిక్ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగెం సైదయ్య తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నేరుగా బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో హార్టీ సెట్ ద్వారా సీటు సంపాదించవచ్చు. వివరాల కోసం హెల్ప్ డెస్క్ నంబర్ 9652456779లో సంప్రదించాలని లేదా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

సమస్యల పరిష్కారానికి చర్యలు: కార్పొరేటర్

చిక్కడపల్లి, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జలమండలి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ కార్యాలయంలో శనివారం జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో ఆమె మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా తీవ్రతరం అవుతున్న మంచినీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలపై జలమండలి అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మంచినీటి సరఫరాలో కలుషిత నీరు చేరడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. దీని కోసం అధికారులు, సిబ్బంది వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. రహదారులు అధ్వానంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటితోపాటుగా పెండింగ్‌లో ఉన్న, నూతన మంచినీటి అలాగే సేవరేజి పైప్‌లైన్‌ల ఏర్పాటు ప్రక్రియను మొదలుపెట్టి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొన్నారు.